క్లుప్తంగా

కాంట్రాక్ట్ ఉద్యోగులపై 'కరుణ'



తిరుపతి మంగళం: టీటీడీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులపై టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కరుణ చూపారు. ఎన్నో ఏళ్లగా సాధ్యం కాని కాంట్రాక్ట్ లెక్చరర్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల పెంపు అమలు చేసిన దేవుడు కరుణాకరరెడ్డి అని కాంట్రాక్ట్ ఉద్యోగులు కొనియాడారు. భూమన కరుణాకరరెడ్డిని మంగళవారం సాయంత్రం తన నివాసంలో టీటీడీ కాంట్రాక్ట్ లెక్చరర్లు కలసి దుశ్శాలువా కప్పి, కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి జగనన్న దిక్సూచి

పాకాల: రాష్ట్రానికి జగనన్న ఒక దిక్సూచీ అని...ఆయన సేవలు రాష్ట్రానికి అవసరం ఉందని ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దామలచెరువు సచివాలయం వద్ద మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ మాలతి, కో–ఆప్షన్ మెంబర్ మస్తాన్, వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్, రహీం, ఎంపిటీసీ గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

పేదల కల సాకారం చేసిన సీఎం జగన్

భాకరాపేట: పేదల కలను సాకారం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నామని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిట్టిచెర్ల సచివాలయంలో జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్డీ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైత్ర హాస్పిటల్లో అరుదైన ఆపరేషన్



ఆపరేషన్ చేసిన పాపతో వైద్యులు

తిరుపతి కల్చరల్: అశోక్‌నగర్‌లోని శ్రీచైత్ర హాస్పిటల్లో మంగళవారం 8 నెలల పాపకు అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్‌సుందర్, డాక్టర్ ఏఆర్.రెడ్డి మాట్లాడుతూ 8 నెలల పాపకు యూరినరికి సంబంధించి యురెత్రిపెలియం రావడంతో తులియం లేజర్ ద్వారా ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు. ఇది లక్ష మందిలో ఒకరికి వస్తుందని, పాపకి ఆపరేషన్ చేయడంతో అరుదైన విజయం సాధించడంతో కోలుకుంటోందని తెలిపారు.


ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ



పెళ్లికానుక అందిస్తున్న నాయకులు

చంద్రగిరి: ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను పార్టీ నాయకులు మంగళవారం వధూవరులకు అందజేశారు. స్థానిక కొత్తపేట నూకలకుంటకు చెందిన బబితశ్రీ, శివ వెంకట రాజశేఖర్‌లకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా చంద్రగిరి పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాయకులతో కలసి నూతన వధూవరులకు కానుకను అందజేశారు. సర్పంచ్ ముదికుప్పం రూపా, రామ్మూర్తి, ఎంపీటీసీ మాధవరెడ్డి, తానాటి చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ ఆచారి, జ్యోతి పాల్గొన్నారు.

కనుల పండువగా వసంతోత్సవం



చంద్రగిరి(తిరుచానూరు): కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గజవాహనం రోజున అమ్మవారికి వసంతోత్సవం(చందనోత్సవం) నిర్వహించడం సాంప్రదాయం. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం స్నపన తిరుమంజనం అనంతరం 3గంటలకు అమ్మవారిని ఆలయ ప్రదక్షిణగా సన్నిధి ముఖమండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. సాయంత్రం 3.30గంటలకు అమ్మవారిని స్వర్ణకమల తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగిస్తూ అర్చకులు, అధికారులు చందనం కలిపిన నీళ్లను భక్తులపై చల్లుతూ వసంతోత్సవం కనులపండువగా నిర్వహించారు.

పల్లెపల్లెలో చెవిరెడ్డి ఆధ్యాత్మిక పాదయాత్ర

దారి పొడవునా గోవింద నామస్మరణలు.... అడుగు అడుగులో ఆధ్యాత్మిక పరిమళాలు... వెల్లువెత్తిన భక్తి పారవశ్యంతో మేము సైతం... అంటూ సాగిన గ్రామాల ప్రజలు.... భక్తి చైతన్య రథం ముందుకు సాగుతుండగా..వేలాది మంది భక్తులు వెంటరాగా పద్మావతి అమ్మవారి చెంతకు ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన ఆధ్యాత్మిక పాదయాత్ర ఆద్యంతం కన్నుల పండువగా సాగింది – తిరుపతి రూరల్

- భక్తి పారవశ్యంతో కదిలిన గ్రామీణులు
- గ్రామ గ్రామనా అపూర్వ స్వాగతం



పద్మావతి అమ్మవారి సారెతో వస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు, మహిళలు

కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా పద్మావతి అమ్మవారికి సారెను సమర్పించేందుకు తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం వరకు మంగళవారం ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్యాత్మిక పాదయాత్రను చేపట్టారు. ముందుగా కల్యాణ వెంకన్న ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, కుటుంబసభ్యులతో పాదయాత్రగా తిరుచానూరు బయల్దేరారు. గ్రామస్తులు వేలాది మంది చెవిరెడ్డితోపాటు పాదయాత్రలో వెన్నంటి అడుగులు వే శారు. తుమ్మలగుంట నుంచి గాంధీపురం, అవిలాల, లింగేశ్వరనగర్, సాయినగర్, శ్రీనివాసపురం, పద్మావతిపురం పంచాయతీ ల



గాంధీపురం వద్ద స్వాగతం పలుకుతున్న సర్పంచ్ లక్ష్మిశివ

మీదుగా తిరుచానూరు వరకు ఆధ్యాత్మికయాత్ర కొనసాగింది.

గ్రామగ్రామాన అపూర్వ స్వాగతం

ప్రతి ఏటా తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గజవాహన సేవకు ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం పద్మావతి అమ్మవారికి సారెను సమర్పించేందుకు ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన ఆధ్యాత్మిక పాదయాత్రకు గ్రామ గ్రామాన అపూర్వ స్వాగతం లభించింది. గాంధీపురం పంచాయతీలో సర్పంచ్ లక్ష్మిశివ, అవిలాలలో మాజీ సర్పంచ్ లోకనాథరెడ్డి, సర్పంచ్ సీవీ రమణ, లింగేశ్వరనగర్‌లో సర్పంచ్ కోటేశ్వరరావు, ఎంపీటీసీ శ్రీరాములు, సాయినగర్‌లో సర్పంచ్ డీవీ రమణ, ఉపసర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి, శ్రీనివాసపురంలో మహేశ్వరరెడ్డి, పద్మావతిపురంలో రవిరెడ్డి, రాజేంద్ర, మహి, తిరుచానూరులో సర్పంచ్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ వేముల యశోద, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాలు, కర్పూర హారతులు పట్టారు. ఆయా గ్రామాల నుంచి తిరుచానూరుకు ఆధ్యాత్మిక పాదయాత్ర చేరుకునే సరికి ఆలయ పరిసరాలు అన్ని వేలాది మంది భక్తులతో కిక్కిరిసి పోయాయి. గోవింద నామస్మరణలతో దారిపొడవునా మార్మోగింది.



తిరుచానూరు చేరుకున్న ఆధ్యాత్మిక పాదయాత్ర

ఆలయ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చేపడుతున్న ఆలయ అభివృద్ధి పనులను మంగళవారం డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంగమ్మ ఆలయం ఎంతో చారిత్రాత్మకమైనదని, అద్భుత రీతిలో ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపడుతూ త్వరగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. 2024లో రానున్న గంగ జాతరలోపు అమ్మవారి ఆలయాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తేనున్నట్లు ఆయన తెలిపారు. పనులు పరిశీలన అనంతరం గంగమ్మ తల్లిని ఆయన దర్శించుకొని అర్చక పండితుల ఆశీర్వచనాన్ని అందుకున్నారు. ఆయన వెంట ఆలయ పాలక మండలి సభ్యుడు వెంకటేశ్వర రావు, ధనశేఖర్, హరినాథ్‌రెడ్డి, మాజీ చైర్మన్ భరణి యాదవ్, వైఎస్ఆర్ సీపీ నేతలు ఉదయ వంశీ, వాసాలి ప్రసాద్, నిహార్ ఉన్నారు.

ప్రజల సంక్షేమమే చెవిరెడ్డి కుటుంబ ధ్యేయం

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబం పనిచేస్తుందని తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వాల్‌క్లాక్‌లను అందిస్తున్నారు. వేదాంతపురం పంచాయతీలో మంగళవారం వాటిని ఇంటి ఇంటికి పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ చెరుకుల జనార్దన్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం చెవిరెడ్డి కుటుంబానికి ఒక వ్యసనమన్నారు. నమ్మిన వారి కోసం ప్రాణాలను పణంగా పెట్టి మరీ సేవా కార్యక్రమాలను చేపట్టిన చరిత్ర వారికే దక్కిందన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగానే నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి వాల్ క్లాక్‌లను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గిరిధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటి ఇంటికి వాల్‌క్లాక్‌లను అందిస్తున్న విడుదల మాధవరెడ్డి, చెరుకుల జనార్దన్‌యాదవ్

విశ్వధర్మపీఠంలో గోవర్ధనమాల ధారణ

తిరుపతి రూరల్: తిరుపతికి సమీపంలోని విశ్వధర్మపీఠం ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా గోవర్ధనమాల (శ్రీకృష్ణ దీక్ష) ధారణ కార్యక్రమం ప్రారంభం అయింది. కుంట్రపాకంలోని శ్రీకృష్ణ గీతామందిరంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు సోంప్రకాష్ యాదవ్, జాతీయ కార్యవర్గ సభ్యులు వైఎస్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గోవర్ధన మాల(శ్రీకృష్ణ దీక్ష) ధారణలో భాగంగా తులసి మాల, కంకణం, కడియం, ఉత్తరీయంతో భక్తులు దీక్షాధారణ చేశారు. ఈ సందర్భంగా సోంప్రకాష్‌యాదవ్ మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో తొలిసారిగా ప్రకృతి ప్రేమికులుగా గోవర్ధన మాల కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు వైఎస్ యాదవ్ మాట్లాడుతూ భగవద్గీత ద్వారా శ్రీకష్ణుడు బోధించిన బోధనలు కర్తవ్యం, ధర్మం, జీవకారుణ్యం సూత్రాలను కలిగి ఉంటాయని, జీవితానికి పర్యావరణ, నైతిక విధానాన్ని బలోపేతం చేస్తాయన్నారు. ఈ గోవర్ధన మాల గోవర్ధన పూజ (నవంబర్ 14) న ప్రారంభమై గీత జయంతి (డిసెంబర్ 23) వరకు (40 రోజులు) కొనసాగుతుందన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ మునస్వామి, విశ్వప్రకాశ్, పూర్ణచంద్రరావు, వాసుదేవయ్య, డాక్టర్ సమంత, జశ్వంత్ యాదవ్, మునిరాజు యాదవ్, ప్రొఫెసర్ మహేశ్వరి, రమణమ్మ, భక్తులు పాల్గొన్నారు.



భక్తులతో సోంప్రకాష్‌యాదవ్, వైఎస్ యాదవ్

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పుష్పాభిషేకంలో శ్రీసుందర అయ్యప్ప స్వామివారు



పడిపూజ కోసం పడిమెట్లకు పుష్పాలంకరణ

చంద్రగిరి: ఐతేపల్లి సుందరగిరి అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా మంగళవారం రాత్రి అయ్యప్ప దీక్షబూనిన స్వాములు పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కేరళ నుంచి అయ్యప్ప రుత్వికులను పిలిపించి స్థానిక స్వాములతో పెద్ద ఎత్తున పడికట్ల పూజనిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం గణపతి హోమం, పాలాభిషేకం, కళశాభిషేకం, పంచామృత అభిషేకంను నిర్వహించారు. సాయంత్రం దీప హారతి, పుష్పయాగం కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు అయ్యప్ప కీర్తనలు పాడుతూ 18 మెట్లకు దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ లెక్కల పురుషోత్తమ నాయుడు మాట్లాడుతూ కేరళ అయ్యప్ప స్వామి ఆలయానికి సామాన్య భక్తులు వెళ్లలేకపోతున్నారన్నారు. కాబట్టి కేరళలో అయ్యప్ప ఆలయంలో జరిగే విధంగా ఇక్కడ ఆలయంలో నేతి అభిషేకంతోపాటు విశేష పూజలను నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం అర్చకులు త్రివిక్రమ్, గురుస్వాములు వేణుగోపాల్ నాయుడు, చంద్రా స్వామి, మోహన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.